# నినాదం

తెలంగాణ ప్రాంతీయం

నిఖార్సైన జర్నలిజం

బుధవారం 28, 2025


### తెదేపా మహానాడులో పాల్గొన్న...

## కాప్రా తెలుగుదేశం నాయకులు



**కాప్రా మే 27( నినాదం న్యూస్):**
కడపలో అంగరంగ వైభవంగా జరుగుతున్న తెలుగుదేశం పార్టీ పండుగ, పసుపు సైనికుల ఆత్మీయ సమ్మేళనం మహానాడులో.... తెలంగాణ తెలుగుదేశం పార్టీ నాయకులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా తెలంగాణ తెలుగుదేశం పార్టీ రాష్ట్ర ఉపాధ్యక్షులు నందమూరి సుహాసిని, కాప్రా పట్టణ మాజీ అధ్యక్షుడు టీజీకే మూర్తి, తెలుగు యువత మల్కాజిగిరి పార్లమెంట్ అధ్యక్షుడు సాయి నాగార్జున, ఐ టీడీపీ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షులు తాళికోట హరికృష్ణ, తెలుగుదేశం పార్టీ జనగామ నియోజకవర్గ ఇంచార్జ్ రాముని హరీష్, సాంబశివరావు తదితరులు పాల్గొన్నారు.

## వర్షాకాలంలో అధికారులు అప్రమత్తంగా ఉండాలి



**భీమదేవరపల్లి మే 27 (నినాదం న్యూస్):**
హనుమకొండ జిల్లా పరిషత్ సి ఈ ఓ విద్యాలత ముల్కనూర్ ,భీమదేవరపల్లి గ్రామా పంచాయతీ ల పరిధి లోని నర్సరీలను మంగళ వారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. కమ్యూనిటీ టాయిలెట్ నిర్మాణం కోసం స్థలాన్ని పరిశీలించారు గ్రామాలలోని డ్రైనేజిల పరిశుభ్రత కోసం కమ్యూనిటీ సోక్ పిక్ ఏర్పాటు చేయాలన్నారు. రానున్న వర్షాకాలం దృష్ట్యా అధికారులు,ప్రజలకు ఏ రకమైన ఇబ్బందులు రాకుండా తగు జాగ్రత్తలు తీసుకుని అప్రమత్తంగా ఉండాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో మండల అభివృద్ధి అధికారి వీరేశం ఏ పి ఓ కుమారస్వామి కార్యదర్శిలు పూర్ణాచెందర్ రాజకుమార్ టి ఏ లు రవి లావణ్య తో పాటు ఫిల్డ్ అసిస్టెంట్ లు కృష్ణ ,శ్వేతా తదితరులు పాల్గొన్నారు.

## అమ్మాయిల పరిరక్షణ అందరి బాధ్యత

- బాలికలు సమయపూర్తితో సమాజంలో ధైర్యంగా ముందుకు సాగాలి
- సోషల్ మీడియా పట్ల అమ్మాయులు అప్రమత్తంగా ఉండాలి
- హ్యూమన్ ట్రాఫికింగ్ పై స్కూల్ అసిస్టెంట్లకు అవగాహన కల్పించిన జిల్లా కలెక్టర్




**ఖమ్మం, మే27(నినాదం):** బాలికల భద్రత పట్ల ప్రభుత్వ ప్రాధాన్యత లో మొదటి అంశంగా ప్రత్యేక రక్షణ వ్యవస్థ కల్పిస్తున్నామని జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ అన్నారు. మంగళవారం స్థానిక రిక్కాబజార్ హైస్కూల్ నందు స్కూల్ అసిస్టెంట్ లకు నిర్వహించిన బాలికల రక్షణ, హ్యూమన్ ట్రాఫికింగ్ పై శిక్షణ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ పాల్గొన్నారు. ఈ కార్యక్రమం లో బాలికల భద్రత, హక్కులు, మానవ అక్రమ రవాణా నివారణ అంశాలపై విస్తృతంగా చర్చ జరిగింది. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ, అమ్మాయిలకు కలిగే ఎలాంటి అనుమానాస్పద పరిస్థితులను గుర్తించడంలో ఉపాధ్యాయుల పాత్ర కీలకమన్నారు. అమ్మాయిలు అనుమానాస్పద వ్యక్తులతో మాటలాడే ముందు అప్రమత్తంగా ఉండాలని, సోషల్ మీడియా వాడకంలో జాగ్రత్తలు పాటించాలని, వ్యక్తిగత సమాచారం ఎవరితోనూ మహిళలు పంచుకోవద్దని సూచించారు. ఎవరైనా అనుచితంగా ప్రవర్తించినట్లయితే, తక్షణమే అప్రమత్తం ఉండేలాగా అమ్మాయిలకు ధైర్యం కల్పించాలని వివరించారు. విద్యార్థుల మానసిక, శారీరక మార్పులను గమనిస్తూ అవసరమైన సందర్భాల్లో సలహా, సహాయం ఉపాధ్యాయులు అందించాలని తెలిపారు. సిబ్బందికి బాలికల పట్ల చైతన్యవంతమైన శిక్షణ, వర్క్‌షాప్‌లు నిర్వహించడం ముఖ్యమని అన్నారు. విద్యార్థులు భద్రంగా ఉండాలంటే ఉపాధ్యాయులు ముందుగా అప్రమత్తంగా ఉండాలని, మానవ అక్రమ రవాణా వంటి మానవతా విరుద్ధ చర్యలను ఎదుర్కొనేందుకు స్కూల్ అసిస్టెంట్ల పాత్ర ఎంతో కీలకం అని అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా విద్యాశాఖ అధికారి ఎస్. సత్యనారాయణ, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## సంక్షేమం, అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం చిత్తశుద్ధితో పనిచేస్తుంది : పిఏసి చైర్మన్ ఆరెకపూడి గాంధీ



**శేరిలింగంపల్లి, ప్రతినిధి, (నినాదం న్యూస్) :** సంక్షేమం, అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం చిత్తశుద్ధితో పనిచేస్తుందని, శేరిలింగంపల్లి నియోజకవర్గాన్ని అన్ని రంగాలలో ఆదర్శవంతమైన నియోజకవర్గంగా తీర్చిదిద్దేందుకు మౌలిక వసతుల కల్పనకు పెద్ద పీట వేస్తున్నామని పిఏసి చైర్మన్ ఆరెకపూడి గాంధీ అన్నారు. మంగళవారం హైదర్ నగర్ డివిజన్ పరిధిలోని రాం నరేష్ నగర్ కాలనీలో రూ. 35 లక్షల రూపాయల అంచనా వ్యయంతో నూతనంగా చేపట్టబోయే భూగర్భ డ్రైనేజి పైప్ లైన్ నిర్మాణ పనులకు పిఏసి చైర్మన్ ఆరెకపూడి గాంధీ ముఖ్యఅతిథిగా పాల్గొని కార్పొరేటర్ నార్నె శ్రీనివాస రావు, జలమండలి అధికారులతో కలిసి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పలు కాలనీలలో ప్రజల నుండి వచ్చిన వినతి మేరకు, కార్పొరేటర్లు మా దృష్టికి తీసుకువచ్చిన సమస్యలను పరిగణలోకి తీసుకొని ప్రత్యేక చొరవతో సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్నామని తెలిపారు. అత్యవసరం ఉన్న చోట, నిత్యం పొంగుతున్న ప్రాంతలలో ప్రథమ ప్రాధాన్యతగా పనులు పూర్తి చేస్తామని తెలియచేశారు. భూగర్భ డ్రైనేజి సమస్య పరిష్కారమే ధ్యేయంగా ముందుకు వెళుతున్నామని అన్నారు. యూజీడీ వంటి అభివృద్ధి పనులను నాణ్యత ప్రమాణాలతో చేపట్టాలని, నాణ్యత విషయంలో ఎక్కడ రాజి పడకూడదన్నారు. నియోజకవర్గ అభివృద్ధికి శాయశక్తులా కృషి చేస్తానని, అన్నివేళలో ప్రజలకు అందుబాటులోకి ఉంటూ మెరుగైన ప్రజా జీవనానికి అన్ని రకాల మౌలిక వసతుల కల్పనకు తనవంతు కృషి చేస్తానని అన్నారు.

# మృతదేహాలకు భయపడుతున్న పాలకులు

- సుప్రీం కోర్టు సుమోటోగా స్వీకరించాలి
- ఘటనకు సంబంధించి బాధ్యులకే కేసులు నమోదు చేయాలి
- మీడియా సమావేశంలో వామపక్ష, హక్కుల సంఘాల నేతలు




**ఖమ్మం,మే 27(నినాదం న్యూస్):**
మావోయిస్టు మృతదేహాలను చూసి పాలకులు భయపడుతున్నారని అందుకే నంబాల కేశవరావు - సహా ఎనిమిది మంది మృతదేహాలను అప్పగించలేదని వామపక్ష, ప్రజా హక్కుల సంఘాల నేతలు ఆరోపించారు. శత్రు దేశాల సైనికులు యుద్ధంలో మరణిస్తే మృతదేహాలను స్వదేశానికి అప్పగిస్తారని కానీ మావోయిస్టు మృతదేహాలను అప్పగించకుండా ప్రభుత్వం కిరాతకంగా వ్యవహరించిందని తెలిపారు. మంగళవారం ఖమ్మం సిపిఐ కార్యాలయం గిరిప్రసాద్ భవన్లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో వామపక్ష ప్రజా హక్కుల సంఘాల నేతలు మాట్లాడుతూ ఛత్తీస్ ఘఢ్ ప్రభుత్వం న్యాయస్థానానికి ఇచ్చిన హామీని సైతం నిలబెట్టుకోలేదని వారు ఆరోపించారు. సజీవంగా పట్టుకుని అతి దగ్గర నుంచి కాల్చి చంపారని అందుకే మృతదేహాలను అప్పగించలేదని వారు తెలిపారు. దశాబ్దాల పాటు ప్రజల పక్షాన పోరాడిన వారి మృతదేహాల ముందు తప్పతాగి నాట్యం చేస్తున్నారని ఇదెక్కడి మానవత్వం అని ప్రశ్నించారు. కేంద్ర హోంమంత్రి, ఛత్తీస్ ఘఢ్ హోంమంత్రి నారాయణపూర్ ఎసిపిపై కేసులు నమోదు చేసి విచారణ జరిపి రాజ్యాంగ బద్దంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. రాజ్యాంగంలోని ఆర్టికల్ 21ని పాలకులే ఉల్లంఘిస్తున్నారని వారు తెలిపారు. ఒక సైనిక అధికారి ఫోన్ చేస్తే రెండు దేశాల మధ్య కాల్పుల విరమణ జరిగిందని స్వదేశంలో ప్రజల కోసం పోరాడుతున్న వారు శాంతి చర్చలకు సిద్ధమంటే ఎందుకు స్పందించరని వారు ప్రశ్నించారు. -ఆదివాసీల మనుగడ పైన సుప్రీం కోర్టు స్పందించాలని, ఆపరేషన్ కగార్ను నిలిపివేసి శాంతి చర్చలు జరపాలని డిమాండ్ చేశారు. ఈ మీడియా సమావేశంలో శాంతి సమన్వయ కమిటీ సభ్యులు డాక్టర్ ఎంఎఫ్ గోపీనాథ్, సిపిఐ జాతీయ సమితి -సభ్యులు బాగం హేమంతరావు, సిపిఎం జిల్లా కార్యదర్శి నున్నానాగేశ్వరరావు, ప్రజాపంథా జిల్లా కార్యదర్శి గోకినేపల్లి వెంకటేశ్వర్లు, సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి దండి సురేష్, ఎన్డి నాయకులు లక్ష్మి నారాయణ, సిసిఏ బాధ్యులు కాకి భాస్కర్, ఐవి రమణారావు, రవిమారుత్, విజయ్, చిర్రా రవి, వివిధ పక్షాల నేతలు ఎస్కె జానిమియా, యర్రాబాబు, కొండపర్తి గోవిందరావు, మాదినేని రమేష్, వై. విక్రం, ఝాన్సీ, ఎస్ కె ఖాసీం తదితరులు పాల్గొన్నారు.

## 30న కలెక్టరేట్ ఎదుట నిర్వహించే ధర్నాను జయప్రదం చేయండి



**చేవెళ్ల మే 27(నినాదం న్యూస్):-**
చేవెళ్ల నియోజకవర్గం షాబాద్ మండల కేంద్రంలో వ్యవసాయ కార్మిక సంఘం షాబాద్ మండల అధ్యక్షుడు బేగరి అంజయ్య ఆధ్వర్యంలో ఉపాధి హామీ కూలీల పెండింగ్ బిల్లుల విడుదలపై రంగారెడ్డి జిల్లా కలెక్టర్ ఆఫీస్ ముందు జరిగే ధర్నాకు సంబంధించిన కరపత్రం విడుదల చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా సిఐటియు జిల్లా సహాయ కార్యదర్శి అల్లి దేవేందర్ హాజరై మాట్లాడుతూ కూలీల వేతన బకాయిల విడుదల చేయాలని పట్టణ పేదలకు ఉపాధి హామీ పని కల్పించాలని రోజు కూలి 600 రూపాయలు ఇవ్వాలని రెండు వందల రోజుల పని దినాలు కల్పించాలని మే 30న ఉపాధి హామీ చట్టం రక్షణ కోసం కలెక్టర్ ఆఫీస్ ముందు పెద్ద ఎత్తున ధర్నా కార్యక్రమం జరుగుతుందని ఈ కార్యక్రమాన్ని షాబాద్ మండల పరిధిలోని ఉపాధి హామీ కూలీలు పాల్గొని విజయవంతం చేయాలని అన్నారు రాష్ట్రంలో పెండింగ్లో ఉన్న వేతనాలు వెంటనే విడుదల చేయాలని కొత్త జాబ్ కార్డులు, భార్యాభర్తలకు గడ్డపార, తట్ట, పారా, కొడవలి,గొడ్డలి వంటి పనిముట్లు ఇవ్వాలని, స్పిట్టింగ్ జాబు కార్డులు ఇవ్వాలని, ఫీల్డ్ అసిస్టెంట్లకు పెండింగ్ వేతనాలు ఇవ్వాలని పర్మనెంట్ చేసి జీతాలు పెంచాలని, వంద రోజులు పూర్తయిన ఉపాధి హామీ కూలీలకు ఇప్పటివరకు ప్రభుత్వం బిల్లులు చెల్లించలేదని వెంటనే పెండింగ్ బిల్లులు చెల్లించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు తదితర డిమాండ్లపై 30న కలెక్టర్ ఆఫీస్ ముందు పెద్ద ధర్నా కార్యక్రమానికి లిలిషాబాద్ మండల పరిధిలోని ఉపాధి హామీ కూలీలు తరలిరావాలని అన్నారు ఈ కార్యక్రమంలో సిఐటియు షాబాద్ మండల కన్వీనర్ నరసింహ ఉపాధ్యక్షులు శ్రీనివాస్ ఎదిరే నరసింహ, సుధాకర్, వర్ధన్, కార్తీక్, శంకర్, కార్తీక్ యాదవ్‌లి తదితరులు పాల్గొన్నారు.

## యువతకు ప్రథమ చికిత్స పైన అవగాహన కలిగి ఉండాలి

### -సిపిఐ రాష్ట్ర సమితి సభ్యులు కే రామస్వామి



**చేవెళ్ల మే 27 (నినాదం న్యూస్):-**
చేవెళ్లలో జరుగుచున్న తెలంగాణ రాష్ట్రస్థాయి జనసేన దళ్ శిక్షణ శిబిరంలో రెండవ రోజు మెడికల్ క్యాంపు ఏర్పాటు ఏర్పాటు చేశారు. జనసేవ దళ్ శిక్షణ శిబిరంలో పాల్గొంటున్న యువతీ యువకులు ప్రథమ చికిత్స పైన అందరికీ అవగాహన ఉండాలని అందరూ ఆరోగ్యంగా ఉండాలని ఈ మెడికల్ క్యాంపు ఏర్పాటు చేయడం జరిగిందని డాక్టర్ వేద అన్నారుడాక్టర్ వేద అన్నారు. ఈ కార్యక్రమానికి ఆలూరు పి హెచ్ సి నుండి డాక్టర్ వేద గారు రావడం శిక్షణ శిబిరంలో పాల్గొంటున్న యువతీ యువకులకు ప్రథమ చికిత్స పైన అవగాహన కార్యక్రమం లో భాగంగా ఆరోగ్యం పైన తీసుకునే ఆహారం పైన ప్రత్యేకమైన శ్రద్ధ పెట్టాలని తెలిపారు ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి వడ్ల సత్యనారాయణ చేవెళ్ల మండల పార్టీ కార్యదర్శి ఎం సత్తిరెడ్డి రెడ్డి మొయినాబాద్ మండల పార్టీ కార్యదర్శి కే శ్రీనివాస్ షాబాద్ మండల పార్టీ కార్యదర్శి నక్క జంగయ్య జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ వడ్ల మంజుల కృష్ణ తదితరులు పాల్గొన్నారు

# నేడు వనపర్తిలో జనభేరి బహిరంగ సభ



**వనపర్తి ప్రతినిధి, మే 27 (నినాదం న్యూస్)**
ప్రజా సమస్యల పరిష్కారం...హక్కుల సాధనకై బుదవారం నిర్వహిస్తున్న జనభేరి బహిరంగ సభకు అధిక సంఖ్యలో తరలివచ్చి విజయవంతం చేయాలని బీసీ పొలిటికల్ జెఏసి స్టేట్ చైర్మన్ రాచాల యుగంధర్ గౌడ్ జిల్లా ప్రజలకు పిలుపునిచ్చారు. మంగళవారం వనపర్తి పాలిటెక్నిక్ కళాశాల మైదానంలో జనభేరి బహిరంగ సభకు సంబంధించిన ఏర్పాట్లను పరిశీలించిన అనంతరం మీడియాతో మాట్లాడారు. ప్రజాక్షేత్రంలో తిరిగినప్పుడు వనపర్తి జిల్లా పరిధిలో మా దృష్టికి వచ్చిన సమస్యలను ప్రభుత్వం దృష్టికి ప్రజల సమక్షంలో తెలపాలనే ఉద్దేశంతో జనభేరి సభను నిర్వహిస్తున్నామన్నారు. జిల్లా నలుమూలల నుంచి వచ్చిన, గుర్తించిన సమస్యలను ప్రజల ముందు ఉంచుతామని, జనభేరి మోగించి.. ప్రభుత్వంతో సమస్యలను పరిష్కారం చేయించుకుందామని ప్రజలకు పిలుపునిచ్చారు. ఈ సభకు ముఖ్య అతిథిగా బీసీ మేధావుల ఫోరం అధ్యక్షులు, రిటైర్డ్ ఐఏఎస్ చిరంజీవులు, పలు ప్రజా సంఘాల నాయకులు హాజరవుతున్నారన్నారు. ప్రముఖ జానపద గాయకుడు జంగిరెడ్డి, ఢీ షో విన్నర్ జానులిరి కళాబృందంచే సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కావున పార్టీలు, మతాలు, కులాలకతీతంగా ప్రతీ ఒక్కరూ తప్పనిసరిగా హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని రాచాల విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో బీసీ పొలిటికల్ జెఏసి నాయకులు చింతపల్లి సతీష్ గౌడ్, పాండురంగ యాదవ్, గోటూరి రవీందర్, వివి గౌడ్, కొన్నూర్ గూడుషా, దేవర శివ, అంజన్న యాదవ్, మహేందర్ నాయుడు, రాఘవేందర్ గౌడ్, ధర్మేందర్, ఆస్కని రమేష్, అక్కల మల్లేష్ గౌడ్, చెలిమిల్ల రామన్ గౌడ్, యశ్వంత్, శ్రీనివాస్ గౌడ్, రేనట్ల మల్లేష్ తదితరులు పాల్గొన్నారు

## కల్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ పథకాలు కొండంత భరోసా

### పిఏసి చైర్మన్ ఆరెకపూడి గాంధీ



**శేరిలింగంపల్లి, ప్రతినిధి, (నినాదం న్యూస్) :**
కల్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ పథకాలు పేదింటి ఆడబిడ్డలకు కొండంత భరోసానిస్తున్నాయని పిఏసి చైర్మన్ ఆరెకపూడి గాంధీ అన్నారు. కూకట్పల్లి మండలం పరిధిలోని వివేకానంద నగర్, హైదర్ నగర్, ఆల్విన్ కాలనీ , కూకట్పల్లి (పార్ట్) డివిజన్ల పరిధిలోని పలువురికి కల్యాణ లక్ష్మి, షాదిముబారక్ పథకం ద్వారా 10 మంది లబ్ధిదారులకు రూ.10,01,160 ఆర్థిక సహాయం మంజూరు అయింది. మంజూరైన ఆర్థిక సహాయాన్ని మంగళవారం వివేకానంద నగర్ లోని ఎమ్మెల్యే కార్యాలయంలో పిఏసి చైర్మన్ ఆరెకపూడి గాంధీ కార్పొరేటర్ ఉప్పలపాటి శ్రీకాంత్ తో కలిసి చెక్కుల రూపేణా పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పేదల సంక్షేమమే ధ్యేయంగా తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం పని చేస్తుందని అన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పేదల పక్షపాతి అని, పేదింటి ఆడ బిడ్డకు పెద్ద అన్న లాగా నిలుస్తున్నారని తెలిపారు. నిరుపేదల అడబిడ్డల పెళ్లికి దేశంలో ఎక్కడా లేని విధంగా, మానవతా దృక్పథంతో కల్యాణ లక్ష్మి షాది ముబారక్ పథకం ప్రవేశపెట్టడం జరిగినదన్నారు. అర్హులైన ప్రతి ఒక్కరూ ప్రభుత్వ సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో నాయకులు నాయినేనీ చంద్రకాంత్ రావు, హరినాథ్, నాగేశ్వరరావు, అష్రాఫ్, శ్రీకాంత్, యాసిన్, లబ్ధిదారులు, మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## భూభారతి చట్టం అమలులో సర్వేయర్ల పాత్ర కీలకం

- శిక్షణ పొందిన సర్వేయర్లు భూ హద్దులలో రైతులకు న్యాయం చేయాలి.
- ల్యాండ్ సర్వేయర్ల శిక్షణను సద్వినియోగం చేసుకోవాలి
- టిటిడిసిలో నిర్వహిస్తున్న లైసెన్స్ సర్వేయర్లల శిక్షణ కార్యక్రమంలో దిశానిర్దేశం చేసిన జిల్లా కలెక్టర్



**ఖమ్మం, మే 27(నినాదం న్యూస్):**
రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన భూభారతి చట్టంలో భూ సమస్యల శాశ్వత పరిష్కారానికి లైసెన్స్ సర్వేయర్ల పాత్ర కీలకమని జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ అన్నారు. మంగళవారం స్థానిక టిటిడిసి భవనంలో సర్వే, ల్యాండ్ రికార్డు శాఖ ఆధ్వర్యంలో లైసెన్స్ సర్వేయర్లకు మొదటి బ్యాచ్ శిక్షణ కార్యక్రమానికి జిల్లా కలెక్టర్ ముఖ్య అతిథిగా హాజరైనారు. భూ భారతి చట్టం, భూ సమస్యలపై సమగ్ర అవగాహన, భూ మ్యాప్, నక్షా, భూ హద్దులు తదితర విషయాలపై స్పష్టంగా సర్వేయర్ల అవసరమని వారి విధుల పై అవగాహన కల్పిస్తు కలెక్టర్ వారికి దిశానిర్దేశం చేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ మాట్లాడుతూ భూభారతి చట్టం అమలులో లైసెన్స్ సర్వేయర్లు క్రియాశీలక పాత్ర పోషించాల్సి ఉంటుందని అన్నారు. సర్వేయర్ల కొరతను అధిగమించేందుకు వీలుగా ప్రభుత్వం రాష్ట్ర వ్యాప్తంగా ఐదు వేల మంది లైసెన్సుడ్ సర్వేయర్లను ఎంపిక చేసి, వారికి శిక్షణ అందించి అర్హత సాధించిన వారికి లైసెన్సులను జారీ చేయనుందని తెలిపారు. ఇందులో భాగంగా జిల్లాలో దరఖాస్తు చేసుకున్న వారిలో అర్హత కలిగిన వారికి శిక్షణ కోసం ఎంపిక చేశామని అన్నారు. 50 రోజుల పాటు వీరికి భూముల సర్వేలో నిష్ణాతులు, అనుభవజ్ఞులైన వారిచే శిక్షణ ఇస్తున్నామని వివరించారు. భూభారతి చట్టంలో పొందుపర్చిన సెక్షన్ ల ప్రకారం భూముల క్రయవిక్రయాలు, సక్సేషన్ వంటి వాటికి సంబంధించి క్షేత్రస్థాయిలో భూముల సర్వే జరిపి మ్యాప్ లను రూపొందించాల్సి ఉంటుందన్నారు. భవిష్యత్తులో ఎలాంటి వివాదాలకు ఆస్కారం ఉండకూడదనే ఉద్దేశ్యంతో ప్రభుత్వం వ్యవసాయ భూములకు కూడా సర్వే మ్యాప్ లను జతచేయాలని భూభారతి చట్టంలో పొందుపర్చిందని స్పష్టం చేశారు. ఈ మేరకు లైసెన్సుడ్ సర్వేయర్లు సర్వే జరిపి భూముల హద్దులు, సమగ్ర వివరాలతో సర్వే మ్యాప్ లను సమర్పిస్తే, వాటిని ప్రభుత్వ సర్వేయర్లు పరిశీలించి ఆమోదించిన మీదట పట్టా పాస్ బుక్ కు జతచేయడం జరుగుతుందని తెలిపారు. పట్టా పాస్ బుక్ లు కలిగిన రైతులు ఎవరైనా సరే సర్వే మ్యాప్ కోసం దరఖాస్తు చేసుకుని, లైసెన్సుడ్ సర్వేయర్లచే సర్వే చేయించుకోవచ్చని సూచించారు. అదేవిధంగా ప్రభుత్వం ప్రతి భూమి పార్సిల్ కు ఆధార్ తరహాలో భూధార్ నెంబర్ ను కేటాయించనుందని, దీని కోసం కూడా లైసెన్సుడ్ సర్వేయర్ల సేవలు అవసరం అవుతాయని అన్నారు. దీనిని దృష్టిలో పెట్టుకుని శిక్షణ సందర్భంగా నేర్పించే అంశాలను చక్కగా ఆకళింపు చేసుకోవాలని, శిక్షణ కార్యక్రమాన్ని పూర్తి స్థాయిలో సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ హితవు పలికారు. లైసెన్స్ సర్వేయర్లకు గెట్టు, భూమి హద్దులు, రెవెన్యూ చట్టాలు, హక్కులు తదితర అంశాలపై థియరీ క్లాసులతో పాటు క్షేత్రస్థాయిలో చెయిన్ సర్వే, మ్యాప్ రీడింగ్ వంటి వాటి గురించి శిక్షణ ఇవ్వడం జరుగుతుందన్నారు. భూ సంబంధిత సమస్యలలో అత్యధికంగా సర్వేతో ముడిపడిన అంశాలే ఎక్కువగా ఉన్నందున లైసెన్సుడ్ సర్వేయర్లు చక్కగా సేవలందిస్తే, అనేక భూ సమస్యల దరఖాస్తులు పరిష్కారం అవుతాయని, తద్వారా భూ వివాదాలకు తావు లేకుండా చేయాలనే ప్రభుత్వ సంకల్పం నెరవేరుతుందని అన్నారు. సర్వేయర్ల శిక్షణలో ఎలాంటి సందేహాలు ఉన్నా, ఏమాత్రం సంశయానికి లోను కాకుండా వాటిని నివృత్తి చేసుకోవాలని సూచించారు. 50 రోజుల పని దినాలలో కొనసాగే శిక్షణ కార్యక్రమాన్ని సంబంధిత అధికారులతో పాటు తాను కూడా ఎప్పటికప్పుడు నిశితంగా పర్యవేక్షిస్తానని అన్నారు. భూభారతి చట్టం గురించి అవగాహన ఏర్పర్చుకుని, భూముల సర్వే విధానాన్ని సమగ్రంగా నేర్చుకుంటే లైసెన్సుడ్ సర్వేయర్ గా చక్కటి ఆదాయ వనరులను పొందవచ్చని సూచించారు. శిక్షణ పూర్తి చేసుకున్న వారికి రాష్ట్ర ప్రభుత్వం పరీక్షను నిర్వహిస్తుందని, ఈ పరీక్షలో ఉత్తీర్ణులు అయిన లైసెన్సుడ్ సర్వేయర్లుగా ప్రభుత్వం గుర్తింపు పత్రాలను జారీ చేస్తుందని కలెక్టర్ తెలిపారు. భూ భారతి చట్టం ద్వారా భూములు లావాదేవీలు జరిగినప్పుడు సర్వే చేసి హద్దులను నక్షాల్లో పొందుపరిచిన తరువాత రిజిస్ట్రేషన్లు జరుగుతాయని దీనివల్ల తగాదాలకు చోటు ఉండదని కలెక్టర్ తెలిపారు. నిరుద్యోగులు ఈ ట్రైనింగ్ పూర్తి చేసి రైతులకు, ప్రజలకు న్యాయం చేయాలని కలెక్టర్ కోరారు. అనంతరం నూతన సర్వేయర్లకు శిక్షణ మెటీరియల్ ను కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ అందజేశారు.

